ప్రజాశక్తి

గురువారం 10 నవంబర్ 2022 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

కొలిక్కిరాని నకిలీ రుణాల బాగోతం

- కొనసాగుతున్న విజిలెన్స్ దర్యాప్తు
- సొసైటీల్లో ఆగని ఉద్యోగుల చేతివాటం
- ఏడాదిలో 20 మంది సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో ఉద్యోగుల చేతి వాటం పెరుగుతోంది. ఎనిమిది నెలల క్రితం పలు సహకార సంఘాల్లో నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు వినియోగించి కొంత మంది అక్రమంగా రుణాలు పొందిన వ్యవహారం మరువక ముందే ఇంకా పలు సంఘాల్లో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలతో రుణాలు పొందిన వ్యవహారం ఇంకా కొలిక్కిరాలేదు. ఈ అంశంపై విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం అధికారులు గత ఆరు నెలలుగా దర్యాప్తు చేస్తున్నా పూర్తిస్థాయి

నివేదిక సమర్పించలేదు.

ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ కుంభకోణంలో రూ.10.95 కోట్లు అక్రమంగా రుణాలు పొందినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో వివిధ సహకార సంఘాల్లోని 12 మందిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇదే రీతిలో డిసిసిబిలోనూ నలుగురు కిందిస్థాయి అధికారులను సస్పెండ్ చేశారు. ఈ అంశంపై అప్పట్లో టిడిపి, వైసిపి నాయకుల మధ్య మాటల యుద్ధం జరిగింది. రూ.100 కోట్ల వరకు నిధులు దారి మళ్లాయని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. టిడిపి హయాంలోనే ఈ కుంభకోణం జరిగిందని డిసిసిబి బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ప్రతి విమర్శ చేశారు. ఉద్యోగులను మాత్రమే బలి చేసి ఆయా సంఘాల్లో త్రిసభ్య కమిటీలను ఎలా కొనసాగిస్తారని ధూళిపాళ్ల నరేంద్ర తప్పుబట్టారు. అయితే ఈ వ్యవహారంలో విజిలెన్సు నివేదికలో వాస్తవాలు వెల్లడికావాల్సి ఉంది.

తాజాగా వినుకొండ, పొన్నూరు, నగరంలో కూడా రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడిన ముగ్గురు బ్రాంచి మేనేజర్లు ఇటీవల సస్పెండ్ అయ్యారు. వినుకొండ మేనేజరు రూ.1.50 కోట్లను స్వాహా చేయగా అతని నుంచి ఈ సొమ్ము రికవరీ చేసినట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఒ టి.కృష్ణవేణి తెలిపారు. పొన్నూరులో రూ.2.50 కోట్లు స్వాహా చేశారు. పొన్నూరులో బ్యాంకు ఉద్యోగులు తమ గుర్తింపు నంబర్లు వినియోగించి అక్రమాలకు పాల్పడ్డారు. 2016 నుంచి ఈ బ్రాంచిలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించారు. దీంతో మేనేజర్‌తో పాటు ఉద్యోగులను కూడా సస్పెండ్ చేశారు. నగరం బ్రాంచిలో సొసైటీ రుణాలను రూ.80 లక్షలు మేనేజరు తన ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. దీంతో ఇక్కడి బ్రాంచి మేనేజర్‌ను కూడా సస్పెండ్ చేశారు.

మూడు నెలల క్రితం తెనాలి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో నకిలీ బంగారం తాకట్టు పెట్టుకుని రుణాలు ఇచ్చిన ఘటన

▸ 2లో

వడ్డీ వ్యాపారి వేధింపులు - ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - నరసరావుపేట

మహబూబ్ సుభాని మృతదేహం

వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని మూడు బావుల సెంటర్‌కులో బుధవారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబీకుల వివరాల ప్రకారం.. ఆటో డ్రైవరైన మహబూబ్ సుభాని(47) కుటుంబ అవసరాల కోసం గుంటూరు చెందిన వడ్డీ వ్యాపారి వద్ద కొన్ని నెలల కితం రూ.6 వడ్డీకి రూ.30 వేలు తీసుకున్నాడు. నెల నెల వడ్డీ చెల్లిస్తూనే అసలు కూడా కొంత జమ చేస్తున్నారు. అయితే ఆటో మరమ్మతులు, కుటుంబలో ఇతర అవసరాల కారణంగా నాలుగు నెలలుగా వడ్డీ చెల్లించలేదు. దీంతో వడ్డీ వ్యాపారి బుధవారం ఉదయం సుభాని ఇంటి వద్దకు వచ్చి డబ్బుల కోసం పట్టుబట్టాడు. అంతటితో ఆగక సుభానీని

▸ 2లో

బాలికను బెదిరించి అత్యాచారం

నిందితుణ్ణి అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - మేడికొండూరు

బాలికను సోషల్ మీడియా ద్వారా పరిచయం చేసుకుని, స్నేహం పేరుతో దగ్గరై పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన యువకుణ్ణి మేడికొండూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ

▸ 2లో

వివరాలు వెల్లడిస్తున్న సిఐ అల్తాఫ్ హుస్సేన్

గర్భిణి కడుపులో గడ్డి మందు

కాలిపోయిన పేగులు - ఆరోగ్యం విషమించడంతో వెంటిలేటర్‌పై వైద్యం - ఆలస్యంగా వెలుగులోకి

5లో

నరసరావుపేట డివిజన్‌లోనే బొల్లాపల్లి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

2 లో

6 లో

గుంటూరు జిజిహెచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కలెక్టర్ తదితరులు

రేపు సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

ఏపీలో జెసిబి పాలన

- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్
- ఇప్పటంలో ఇళ్ల కూల్చివేత బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రాష్ట్రంలో జెసిబి పాలన నడుస్తోందని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఎంటిఎంసి పరిధిలోని ఇప్పటంలో టిడిపి నాయకులతో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఇళ్లను గత శుక్రవారం తొలగించిన క్రమంలో బాధితులను పరామర్శించారు. అనంతరం లోకేష్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక జెసిబిలతో

▸ 2లో

గిరిజనుల పట్ల నిర్లక్ష్యాన్ని సహించం

- బ్యాక్‌లాగ్ పోస్టులు ఎందుకు భర్తీ చేయట్లేదు
- విద్య, వైద్యం, పోలీసు, పలు శాఖల అధికారులపై ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు ఆగ్రహం
- చేబ్రోలు తహశీల్దార్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశం

అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న రవిబాబు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి చట్టపరంగా అవసరమైన చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అటువంటి అధికారులకు సమన్లు జారీ చేస్తామని, అవసరమైతే న్యాయపరమైన అధికారాలు వినియోగించటానికీ వెనుకాడబోమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంభా రవిబాబు హెచ్చరించారు. జిల్లాలో గిరిజనులు ఎంత మంది ఉన్నారు, ఎన్ని కుటుంబాలు ఉన్నాయో కూడా అధికారుల వద్ద స్పష్టమైన వివరాలు లేకపోవటం విచారకరమన్నారు. రెండ్రోజులపాటు జిల్లాలో పర్యటించిన కమిషన్ ఛైర్మన్ రవిబాబు, సభ్యులు శంకర్‌నాయక్, మురళీ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఉద్యోగాల భర్తీలో, ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, గిరిజనుల అభ్యున్నతికి వివిధ శాఖల్లో తీసుకుంటున్న చర్యలపై శాఖల వారీగా చర్చించారు. ఎక్కువ మంది అధికారులు తగిన సమాచారం లేకుండా సమావేశానికి రావటంపై ఛైర్మన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల ప్రభుత్వం బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసినప్పుడు వివిధ శాఖల్లో ఖాళీల వివరాలు కలెక్టర్‌కు ఎందుకు ఇవ్వలేదని విద్యాశాఖ, పోలీసు, మెడికల్ అండ్ హెల్త్, జిఎంసి తదితర శాఖల అధికారులపై మండిపడ్డారు. విద్యాశాఖలో ఎంత మంది టీచర్లు ఉన్నారు? వారిలో గిరిజనులు ఎంత

▸ 2లో



రవిబాబుకు బొకే అందచేస్తున్న కెఎస్ లక్ష్మణరావు

గిరిజన గురుకులాలు ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, పల్నాడు జిల్లాలో గిరిజన విద్యార్థుల కోసం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు ప్రారంభించే విధంగా కృషి చేయాలని ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంభా రవిబాబును ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. గుంటూరు పర్యటనకు వచ్చిన రవిబాబును బుధవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో కలిసిన లక్ష్మణరావు ఈ అంశంపై మాట్లాడారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల తరహాలో 5

▸ 2లో

మాట్లాడుతున్న డాక్టర్ రాజ్యలక్ష్మి

కవికుల గురువు మహాకవి కాళిదాసు

ప్రజాశక్తి-గుంటూరు

సంస్కృత సాహిత్యంలో ధ్రువతారగా వెలిగిన మహాకవి కాళిదాసు కవి కుల గురువుగా ఖ్యాతినార్జించారని ప్రముఖ సాహితీవేత్త రచయిత్రి డాక్టర్ వెలుఓలు నాగ రాజ్య లక్ష్మి పేర్కొన్నారు.బుధవారం స్థానిక హిందూ కళాశాల సంస్కృత విభాగం ఆధ్వర్యంలో కాళిదాసు జయంతి నిర్వహించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ పిఎం ప్రసాద్ అధ్యక్షత వహించగా, డాక్టర్ నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ సంస్కృతంలో కాళిదాసు రచించిన కావ్యాలలో రఘువంశము, కుమార సంభవము, నాటకాలలో అభిజ్ఞాన శకుంతలము ప్రఖ్యాతి గాంచాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, అధ్యాపకులు డాక్టర్ ఆలూరి నటరాజకుమారి, మతుకుమల్లి తపతీ కిరణ్ సంస్కృత, తెలుగు విభాగాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసరావుపేట డివిజన్‌లోనే బొల్లాపల్లి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లా గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న బొల్లాపల్లి మండలాన్ని నర్సరావుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోకి మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల పునర్విభజనలో నర్సరావుపేట డివిజన్‌లో ఉన్న బొల్లాపల్లిని గురజాలలో కలిపారు. బొల్లాపల్లికి గురజాలకు 70 కిలో మీటర్ల దూరంఉంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ప్రభుత్వం ఈ మార్పు చేసి జీవోనిచ్చింది. ఈ అంశంపై నెల రోజుల్లోగా తమ అభ్యంతరాలను పల్నాడు జిల్లా కలెక్టర్‌కు పంపాలని సూచించింది. ఉత్తర్వుల ప్రకారం వినుకొండ, నర్సరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లోని 10 మండలాలు నరసరావుపేట డివిజన్‌లో ఉంటాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గాలోని తొమ్మిది మండలాలు గురజాల డివిజన్‌లో ఉంటాయని, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని 9 మండలాలు సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంటాయని రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారి వేధింపులు - ఆటో డ్రైవర్ ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

దుర్భాషలాడాడు. దీంతో మనస్థాపానికి గురైన మహబూబ్ సుభాని మధ్యాహ్నం వేళ పట్టణానికి సమీపంలోని వల్లపు చెరువు వైపు నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. సమీపంలో పొలం పనులు చేసుకుంటున్న రైతులు ఇది గమనించి పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫాతిమా ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కొలిక్కిరాని నకిలీ రుణాల బాగోతం

(మొదటి పేజీ తరువాయి)

వెలుగుచూసింది. రూ.40 లక్షల వరకు అక్రమాలు జరిగాయి. ఈ ఘటనలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, ఆపరేటర్‌లను అప్పట్లో సస్పెన్షన్ చేశారు. తరువాత వారి నుంచి సొమ్ము రికవరి చేశారు. సహకార సంఘాలకు దాదాపు ఐదేళ్లగా ఎన్నికలు జరగకపోవడం, ఈ సంఘాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడటం, రాజకీయ జోక్యం పెరగడం తదితర కారణాలతో రైతులకు, వివిధ తరగతుల వారికి అందిచాల్సిన రుణాలల్లో స్వాహా పర్వం పెరుగుతోంది.

గిరిజనుల పట్ల నిర్లక్ష్యాన్ని సహించం

(మొదటి పేజీ తరువాయి)

మంది? బ్యాక్‌లాగ్స్ ఎందుకు భర్తీ చేయలేదని ఛైర్మన్ ప్రశ్నిస్తే డిఇఒ సరైన వివరాలు సమర్పించకపోవటంతో అసహనం వ్యక్తం చేశారు. సుమారు 54 పోస్టులు బ్యాక్‌లాగ్స్ ఉన్నా ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. ఇటీవల టీచర్ల ప్రమోషన్లలో ఎస్టీ టీచర్లకు అన్యాయం జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ తెలిపారు.

జిఎంసిపై సమీక్షించిన ఛైర్మన్ పారిశుధ్య విభాగంలో తప్ప ఇతర విభాగాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించట్లేదన్నారు. పారిశుధ్య విభాగంలో ఎస్టీలకు ఇవ్వాల్సిన పోస్టుల కంటే ఎక్కువ ఇచ్చి మొత్తంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తున్నామని సమర్థించుకుంటున్నారన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి జరిగే బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో ప్రతి శాఖలోని ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గిరిజన శాఖలో తనకు పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని గోవింద్ నాయక్ అనే ఉద్యోగి ఫిర్యాదు చేయగా, దానిపై విచారణ చేయాలని డిటిడబ్ల్యూఒను ఆదేశించారు. నియామకాల్లో ఆర్ఒఆర్ పాటిస్తున్నామని వివరాలు అందజేసిన జెడ్పీ సిఇఒను అభినందించారు. సమావేశంలో డిఆర్ఒ చంద్రశేఖర్‌రావు, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఏఎస్‌పి శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల స్పందన బాలేదు..

పోలీసు శాఖలో ఉద్యోగుల వివరాలకు సంబంధించి ఒక్క రిపోర్ట్ కూడా సమర్పించలేదని రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ అధికారాలున్న కమిషన్ వస్తేనే ఇంత నిర్లక్ష్యంగా ఉంటున్న వారు సాధారణ ప్రజలతో ఏ విధంగా ఉంటున్నారో అర్థం అవుతుందన్నారు. తెనాలిలో ఒక గిరిజన మహిళలపై దాడి జరిగిన విషయంపై స్వయంగా తాను అనేకసార్లు ఎస్పీకి, తెనాలి డిఎస్‌పికి లేఖలు రాసినా స్పందించలేదని మండిపడ్డారు. అట్రాసిటీ కేసులపైనా విచారణా సరిగా లేదన్నారు. చట్టాన్ని నీరుగారుస్తున్నారని అన్నారు. ఉద్యోగుల వివరాలు లేకుండా ఎందుకు సమావేశానికి వచ్చారని ఏఎస్‌పి శ్రీనివాసరావును తీవ్రంగా ప్రశ్నించారు. ప్రమోషన్ల కోసం కానిస్టేబుల్స్ నాలుగు నెలలుగా తమ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, మేము ఎస్పీకి లెటర్లు రాస్తున్నా స్పందించట్లేదని, 15 రోజుల్లో వివరాలతో తమ ముందు హాజరు కావాలని ఆదేశించారు.

చేబ్రోలు తహశీల్దార్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశం

నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన చేబ్రోలు తహశీల్దార్, సిబ్బందిపై క్రిమినల్ చర్యలకు కమిషన్ ఛైర్మన్ ఆదేశించారు. వడ్లమూడి పెద్దింటికుల (బిసి-డి)కి చెందిన వారికి 25 మందికి 2019లో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. జారీ చేసిన అప్పటి తహశీల్దాదర్ కృష్ణకాంత్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. నకిలీ ధ్రువపత్రాలు జారీ చేయటం అతి పెద్ద నేరమని, వెంటనే సర్టిఫికెట్లు రద్దు చేయాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధితులైన గిరిజనులు కేసు పెట్టిన సందర్భంగా ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు.

పేదల ఇళ్లకు పట్టాలివ్వాలి..

నంబూరులో ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న యానాది ప్రజలకు తక్షణమే పట్టాలు మంజూరు చేయాలన్నారు. తాము కాలనీలో సందర్శించినప్పుడు వందేళ్ల నాటి గ్రామీణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తాగునీరు, కరెంటు, బాత్‌రూమ్స్, రోడ్లు వంటి కనీస వసతులు లేవన్నారు. కాల్వ గట్లపై నివాసం ఉంటున్న యానాదులకు పదేళ్ల క్రితం గ్రామ పెద్దలు సత్యనారాయణ, శంకర్‌రెడ్డి చొరవతో ప్రభుత్వ భూమిలో గుడిసెలు ఏర్పాటు చేస్తే ఆ స్థలం మాదంటూ కబ్జాదారులు కోర్టుకు వెళ్లారని, వారికి రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడంగళ్‌లో ప్రభుత్వ భూమి అని స్పష్టంగా ఉందని, తక్షణమే పేదలకు పట్టాలు మంజూరు చేయాలని అన్నారు.

తెనాలి వైకుంఠపురంలో కాల్వ గట్టుపై ప్రమాదకరమైన పరిస్థితుల్లో జీవిస్తున్న పేదలకు వేరొక చోట ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలని, బుడంపాడు ఎస్టీ కాలనీలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

ఈనాం భూములు మఠానికి ఎందుకు...

గుంటూరు నగరంలో బావోజీకాలనీలో నివాసం ఉంటున్న ప్రజలకు సదరు స్థలాన్ని శాశ్వత హక్కు కల్పించాలని, ఈ విషయంలో ప్రజలకు అండగా ఉంటుందని రవిబాబు స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా అక్కడ గిరిజన ప్రజలు నివాసం ఉంటున్నారని, అది బావోజి మఠానికి చెందినదని ఎండోమెంట్ వారు కోర్టుకు వెళ్లటాన్ని ఆయన తప్పుబట్టారు. అలహాబాద్‌లో ఉన్న మఠానికి ఏపీలో వందల ఎకరాలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమి అని 22ఎ లిస్టులో చేర్చి, ఇప్పుడు మఠం భూమి అని కోర్టుకు వెళ్లటం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిని మఠంకు కేటాయించటం సరికాదని, పేదలకు పట్టాలు ఇవ్వాలని చెప్పారు.

గిరిజన భవన్ నిర్మించాలి..

గుంటూరు నగరంలో గిరిజన భవన్ నిర్మించాలని పలు గిరిజన సంఘాల నాయకులు రవిబాబుకు వినతిపత్రం అందచేశారు. గతంలో జెడ్పీ నుండి స్థలం కేటాయించగా, ప్రభుత్వం రూ.30 లక్షలు కూడా కేటాయించిందన్నారు. కానీ అధికారులు పట్టించుకోకపోవటంతో నిర్మించలేదన్నారు. ఇప్పటికైనా గిరిజన భవన్ నిర్మించాలని కోరగా, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జెడ్పి సిఇఒకు, కలెక్టర్‌కు సూచించారు.

బాలికను బెదిరించి అత్యాచారం

(మొదటి పేజీ తరువాయి)

మేరకు వివరాలను సిఐ ఆల్తాఫ్ హుస్సేన్ బుధవారం వెల్లడించారు. మండల కేంద్రమైన మేడికొండూరుకు చెందిన బాలిక ఏడాది క్రితం పదో తరగతి చదువుతోంది. ఇంటర్ చదివి మానేసిన క్రోసూరు మండలం అనంతవరానికి చెందిన కుంభ హరికృష్ణ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాలికకు స్నేహితుడయ్యాడు. ఈ ఏడాది బాలిక గుంటూరులోని ప్రభుత్వ మహిళా కాలేజీలో ఇంటర్ చేరింది. రోజూ బస్సులో వచ్చిపోతోంది. హరికృష్ణ పట్టలు కుట్టే పని కోసం తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లా వెళ్లాడు. అయినా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మాట్లాడుకుంటూ ఉన్నారు. ఈ క్రమంలో బాలికతో అశ్లీల చిత్రాలు చిత్రాలు తీసి తర్వాత బెదిరింపులు మొదలుపెట్టాడు. ఇందులో భాగంగా గత ఆగస్టు 3వ తేదీన పేరేచర్ల వద్ద నగరవనం పార్కుకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరమూ వేధింపులు కొనసాగడంతో బాలిక మేడికొండూరు పోలీసులకు వారం కిందట ఫిర్యాదు చేసింది. దీనిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి నిందితుణ్ణి బుధవారం క్రోసూరు మండలం అనంతవరంలో తన ఇంట్లో అరెస్టు చేశారు. సమావేశంలో ఎస్ఐ కోటేశ్వరరావు , పిసి సిద్ధు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నరసరావుపేట

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో గల ఉన్నత పాఠశాలకు నాడు -నేడు పథకం ద్వారా పాటశాలలలో రూ 1.70 కోట్లతో నిర్మించనున్న అదనపు తరగతి గదులు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శంకుస్థాపన చేశారు. పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉండగా అదనపు తరగతి గదుల ఏర్పాటుతో మరో 100 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం ద్వారా పోషకాహారం అందించేటమే వైసిపి లక్ష్యమని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ అమలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి మూరబోయిన సుబ్బాయమ్మ, శ్రీనివాసరావు, జడ్పిటిసిపి.చిట్టిబాబు,గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపిటిసి, అధికారులు, గ్రామ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఏపీలో జెసిబి పాలన

(మొదటి పేజీ తరువాయి)

కూల్చడమే పనిగా పెట్టుకుందని, ప్రజా వేదికతో ఈ క్రమాన్ని మొదలు పెట్టారని అన్నారు. సొంత నియోజకవర్గమైన పులివెందులలో బస్టాండ్ కూడా నిర్మించలేకపోయారని ఎద్దేవ చేశారు. ఈ ప్రాంతంలో ఇళ్ల కూల్చి వేత కోసం స్థానిక ఎమ్మెల్యే ఏకంగా సొంత జెసిబిని కొన్నారని, ఆత్మకూరులో 72 ఇళ్లు, పేరుకలపూడి 16 ఇళు ,, షాపులు, పెదవడ్లపూడిలో 50 ఇళ్లు, అమరారెడ్డి కాలనీలో 300 ఇళ్లు, నూతక్కిలో 15 ఇళ్లు, ప్రకాష్ నగర్, డోలాస్ నగర్‌లో 30 షాపులు కూల్చారని చెప్పారు. కురగల్లు, నిడమర్రులో 50 ఇళ్లకు నోటీసులు ఇచ్చారన్నారు. జనసేన సభకు భూములిచ్చారని, ఎన్నికల్లో ఈ గ్రామంలో టిడిపికి మెజార్టీ వచ్చిందనే కక్షతో ఇళ్లను కూల్చారని ఆరోపించారు. ఇప్పటం గ్రామస్తుల పోరాటానికి టిడిపి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్.అబద్ధయ్య, తాడేపల్లి మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు, గ్రామ అధ్యక్షులు ఎస్.పిచ్చయ్య, నాయకులు కె.శేషు, కె.మధుబాబు, ఎ.శ్రీనివాసరావు, ఎస్.కె నాగుల్, ఈ.బాబు, ఎం.సుబ్రమణ్యం, ఎ.రంగారావు, సిహెచ్ సుబ్బారావు, ఎస్.నాని, ఎస్.కె నాగూర్‌వలి పాల్గొన్నారు.

గిరిజన గురుకులాలు ఏర్పాటు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల స్థలంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో సంక్షేమ హాస్టల్స్‌ను గురుకులాలుగా మార్చారని, వాటి వల్ల విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వాటిలో మౌలిక వసతులు లేవని తెలిపారు. ఇప్పటికే ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 1300 మంది ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని కోరారు. ఈ అంశాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని ఛైర్మన్ హామీ ఇచ్చారని లక్ష్మణరావు పేర్కొన్నారు.

నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు, తదితరులు

డిఎం తీరును నిరసిస్తూ గేట్ మీటింగ్

ప్రజాశక్తి - వినుకొండ

డిపో మేనేజర్ తీరును నిరసిస్తూ స్థానిక ఆర్‌టిసి డిపో ఎదుట ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఎపి పిటిడి) ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి టిఎస్ రావు అధ్యక్షత వహించగా డిపో అధ్యఓఉలు డిజి విన్సెంట్ మాట్లాడుతూ మేనేజర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, అక్రమంగా పనిష్‌మెంట్లు వేస్తున్నారని చెప్పారు. తీరు మార్చుకోకుంటే ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కె ఖాజా, కె.హరిబాబు, జి.వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఎన్ రెడ్డి, సివిజి రెడ్డి, జి.శీను, కరిముల్లా పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రోడ్డు మలుపులు

ప్రజాశక్తి - తాడేపల్లి

రాజధానికి ముఖద్వారంగా ఉన్న ఉండవల్లిలో పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న మూడు మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నాయి. గతంలో రహదారుల విస్తరణ నేపథ్యంలో ఉండవల్లి సెంటర్ నుండి సచివాలయం వెలగపూడి వరకు డబల్‌లైన్ రోడ్డు విస్తరణ చేపట్టి పూర్తిచేశారు. ఉండవల్లి పంచాయతీ కార్యాలయం మూలమలుపు నుండి శ్మశానం వరకు సుమారు 400మీటర్లు గల రోడ్డు విస్తరణ ఆగిపోయింది. అప్పట్లో రోడ్డు పక్కనున్న ఇళ్ళ బాధితులు తాము నష్టపోతామని కోర్టును ఆశ్రయించారు. ఫలితంగా కోర్టు స్టే ఇవ్వడంతో మలుపుల వద్ద ఉండవల్లి రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఇప్పటికీ మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి నలుగురు దుర్మరణం పాలయ్యారు. దీంతోపాటు ఉదయం, సాయంత్రం ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీగా ఉండి విట్, ఎస్ఆర్ఎం కాలేజీ బస్సులతోపాటు అనేక ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల బస్సులు అమరావతి-విజయవాడ, విజయవాడ-సచివాలయం బస్సులతో ఈ రోడ్డు కిక్కిరిసిపోతుంది. ఉండవల్లి మూడు మలుపుల వద్ద గంటల తరబడి ట్రాఫిక్ స్థంభించిపోతుంది. వాహనాల వేగం కూడా ఇందుకు తోడవుతుంది. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి చొరవ తీసుకొని ఉండవల్లిలో ఆగిపోయిన 400 మీటర్ల దూరం గల ఉండవల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలోని మూడు మలుపుల వద్ద రోడ్డును విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉండవల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రమాదకరంగా మారిన రోడ్డు మలుపులు

కారు దహనం చేసిన గుర్తుతెలియని దుండగులు

ప్రజాశక్తి-రొంపిచర్ల

గుర్తుతెలియన దుండగులు కారు దహనం చేసిన సంఘటన మండలంలోని సంత గుడి పాడు గ్రామం లో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బి. నరసింహారెడ్డి టాటా ఇండికా కారును దుండగులు నిప్పంటించి దహనం చేశారు. సుమారు రూ.1,50,000 నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. బాధితుడు రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి దుండగులను పట్టుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - చేబ్రోలు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, నాడు -నేడులో భాగంగా పాఠశాలలు అభివృద్ధి చెందాయని , లైజనింగ్ ఆఫీసర్ టి. ఆశోక్ కుమార్ అన్నారు. బుధవారం నాడు- నేడు పనులను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు వైఎస్ఆర్ క్రాంతి పథం, డిఆర్‌డిఏ సిబ్బంది, విద్యా శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల కమిటీలను బలోపేతం చేయాలని అన్నారు. బడి మానుకునే పిల్లలు శాతాన్ని పూర్తిగా తగ్గించేందుకు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని తెలియజేశారు .ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి మనబడి నాడు- నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు..కార్యక్రమంలో మండల విద్యాధికారి జె.సుబ్బారావు వైయస్సార్ కాంతిపథం సిబ్బంది డిఆర్డిఏ సిబ్బంది ఏపీఎం నాగేశ్వరరావు, సీసీలు, విఓఏలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న టి. ఆశోక్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. మాలతి

అందరికీ అందుబాటులో న్యాయసేవలు

ప్రజాశక్తి-తెనాలి

మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న 11వ అదనపు జిల్లా జడ్జి జి.మాలతి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని 1995 నుంచి ఆచరిస్తున్నట్లు చెప్పారు. కక్షిదారులు రాజీ మార్గంలో పయనించి, ప్రశాంతంగా ఉండాలన్న లక్ష్యంతోనే జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందరికీ న్యాయసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు టి.రామచంద్రుడు, టి.వాణి, షరీఫ్ రహంతుల్లా, జె.శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వేణుగోపాలరావు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, పాల్గొన్నారు.

పొన్నూరు రూరల్ :లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం పొందవచ్చునని పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. సత్య కుమారి పేర్కొన్నారు. పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సివిల్ కోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యకుమారి మాట్లాడుతూ కక్షిదారులు సత్వర న్యాయం పొందేందుకు న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి డి శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు న్యాయవాది గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	35,363
మిర్చి ఎగుమతి	:	35,065
మిర్చి నిల్వ	:	12,187

మిర్చి ధరలు

	రూపాయలలో
334	11500-28000
నెం.5	20500- 25000
341	15000- 27000
సూపర్10	25800- 25800
నాన్ ఎసి	
తేజ	7000- 25000
బడిగె	13200- 27200
దేవనూర్ డీలక్స్	23000- 27000
తాలుకాయలు	5,000- 14,000
	ఎసి
334	18000-27000
341	20800- 24500
4884	23000-23500
తేజ	10000-24000
బడిగె	20500-28000
దేవనూర్ డీలక్స్	16000 - 16000
తాలుకాయలు	5,800 - 12,000

రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

10మందికి గాయాలు

ఆటో బోల్తా.. మహిళ మృతి

ప్రజాశక్తి - రెంటచింతల

ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తుమకోట గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. మాచర్ల పట్టణంలో సరుకులు కొనుగోలు చేసి స్వగ్రామం తుమకోటకు ఆటోలో బయలుదేరి వస్తుండగా గ్రామ సమీపంలోని మడేలు స్వామి గుడి వద్ద మలుపు తిరుగుతూ ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో గ్రామానికి చెందిన పొట్టి పోగు మరియమ్మ(52)అక్కడికక్కడే మృతిచెందగా ఆటోలో ప్రయాణిస్తున్న మరో-ఐదుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డ లింగా వెంకటేశ్వర్లు, బిక్షం, పులుకూరి రమణ, భవాని, చదలవాడ లక్ష్మీనారాయణకు స్థానిక ప్రథమ చికిత్స చేశారు. మతురాలి భర్త పౌలు కూరగాయలు కిరాణా దుకాణం వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీకొట్టిన లారీ -5 మందికి గాయాలు

ప్రజాశక్తి-దాచేపల్లి

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన సంఘటన పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు సమీపంలోని కోల్డ్ స్టోరేజి వద్ద బుధవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను అటుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఐదుగురికి తీవ్రగాయాలైయ్యాయి. అందులో ఇద్దరు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉంది. నోబుల్ కాలేజిలో చదువుతున్న వీరు కాలేజి నుంచి ఇంటి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. ప్రమాదం జరగడంతో ఇద్దరూ గాయాలపాలయ్యారు. విద్యార్థులు శ్రీనగర్ గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. క్షతగాత్రులను 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాము కాటుతో ఒకరు మృతి

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్.

పాము కాటు ఒకరు మృతి చెందిన సంఘటన పెదనందిపాడు స్టార్ కంపెనీలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం బ్రాహ్మణ నిడమానూరు గ్రామానికి చెందిన యు. మురళి(36) పెదనందిపాడు స్టార్ కంపెనీలో గత కొన్నాళ్లుగా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పనిలో ఉండగా పాము కాటుకు గురయ్యాడు.వెంటనే 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు తండ్రి సింగయ్య బుధవారం పెదనందిపాడు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు చేశారు. తండ్రి సింగయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్ దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి తెనాలి రూరల్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన రూరల్ పరిధిలోని కొలకలూరు నుంచి పెనుమూలి డొంక రోడ్డులో పంట కాలువలో బుధవారం గుర్తించారు. స్థానికులు రెవెన్యూ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన రూరల్ పోలీసులు మృతురాలి వయసు సుమారుగా 35 - 40 ఏళ్ల మధ్య ఉంటుందని, మూడు రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చునని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచితం వైద్య శిబిరం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - నిడుబ్రోలు (1981-82 బ్యాచ్) పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలోబుధవారం మండల పరిధిలోని కసుకర్రు గ్రామ శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో శ్రీ బాలాజీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాపు నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో షుగర్, గ్యాస్ట్రిక్ సమస్యలున్న వారికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. సుమారు 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జక్కా శ్రీనివాస్, యేమినేని బ్రహ్మం, షేక్ కరీముల్లా, అజ్మతుల్లా, ప్రశాంత్ రాజు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ తెనాలి ప్రినిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో
ఓ.ఎస్.నెం. 35/2021

బిట్వీన్
గండు జానకి .... వాది
అండ్
దానబోయిన మల్లేశ్వరరావు మరియు ఇతరులు ..... ప్రతివాదులు

టు,
గుర్రపు సాంబశివరావు, తండ్రి జి.నారాయణ
డోర్ నెం.6-11, రేవేంద్రపాడు గ్రామం,
దుగ్గిరాల మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరు దావా వాది మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకోని కారణంగా శ్రీ కోర్టువారు ఈ పబ్లికేషన్ ఆర్డర్ చేసి 11-11-2022వ తేదీకి వాయిదావేసి యున్నారు. కావున వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై శ్రీ కోర్టువారి ఎదుట మీరుగానీ మీ తరపున న్యాయవాది ద్వారా శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 11-11-2022

ఇట్లు
కూర్మాల దుర్గాప్రసాద్,
వాది తరపు న్యాయవాది.
సెల్ : 98481 48573.

దావా సమను
మహా రాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS NO : 218/2021

Between
కెనరాబ్యాంక్, నాగుల పాలెం బ్రాంచి రి. బై ఇట్స్ బ్రాంచి మేనేజర్ ....వాది
మరియు
M/s శ్రీ గురు కాళీప్రసాద్ ఏజన్సీస్, పర్చూరు వగైరాలు ... ప్రతివాదులు
To
D1) M/s. శ్రీ గురు కాళీప్రసాద్ ఏజన్సీస్,పర్చూరు. రి. బై ఇట్స్ ప్రొ:- తేలప్రోలు సంపత్ కుమార్ S/o శంకరరావు, D.No:3-499. కాళీ గార్డెన్ ఆశ్రమం, పెదకాకాని, గుంటూరు జిల్లా.

పై నంబరు గల దావాను మీ పై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది.28-11-2022వ ఉ. 10-30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గాని వకీలు గారి ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసినది. లేనిఎడల మీ పరోక్షమునందు విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది : 28-11-2022.

రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH.శ్రీ రమణి
న్యాయవాదులు,పర్చూరు.

హర్షిణిని అభినందిస్తున్న జైనేంద్రరెడ్డి

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జైభారత్ విద్యార్థిని

ప్రజాశక్తి-క్రోసూరు

నత్తెనపల్లి మండలం నందిగామ జిడ్పి పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని ఛత్రి హర్షిణి (10వ తరగతి) ప్రతిభ చూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు క్రోసూరులోని జై భారత్ విద్యా సంస్థల డైరెక్టర్ టి.జైనేంద్రారెడ్డి తెలిపారు. తమ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో శిక్షణిస్తున్నామని, ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటే, కుంగ్‌ఫూలోనూ తమ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారని పేర్కొన్నారు. హర్షిణితోపాటు సైక్లింగ్‌లో శిక్షణిచ్చిన పిఇటి కె.స్వాతిని డైరెక్టర్‌తోపాటు హెచ్‌ఎం ఖదీర్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

మోహన్‌కు స్కారల్‌షిప్‌ను అందిస్తున్న జీవీ ఆంజనేయులు

నీట్ ర్యాంకర్‌కు స్కాలర్‌షిప్

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలం పేరూరుపాడుకు చెందిన ముప్పాళ్ల మోహన్ ఇటీవల నీట్‌లో 427 ర్యాంక్ సాధించగా విద్యార్థిని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అభినందించారు. దీంతోపాటు బుధవారం రూ.10 వేల స్కాలర్‌షిప్‌ను శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ద్వారా అందించారు. బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

అబద్ధాల మోడీ.. బాధ్యత లేని జగన్

విశాఖ సభలో ప్రధానిని ప్రత్యేక హోదాపై సిఎం ప్రశ్నించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - మాచర్ల

విశాఖ నిర్వహించే సభలో ప్రధాని మోడీని ప్రత్యేక హోదాపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి గట్టిగా నిలదీయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి సూచించారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అబద్ధాల కోరు ప్రధాని వద్ద బాధ్యత లేని ముఖ్యమంత్రి ప్రత్యేక హోదా గురించి ప్రస్తావించటం మర్చిపోయారని, ప్రత్యేక హోదా లేకుండా రాష్ట్ర అభివృద్ధి అసాధ్యమని అన్నారు. ప్రధానికి సిఎం వంతపాడ్డం వల్లే రాష్ట్రం అభివృద్ధికి దూరంగా ఉందని విమర్శించారు. ప్రత్యేక హోదాపై కేంద్రం వద్ద నాడు టిడిపి, నేడు వైసిపిలు విఫలమ య్యాయని, ప్రత్యేక హోదాపై ప్రశ్నించకపోవడం అంటే రాష్ట్రానికి ద్రోహం చేయడమేనని అన్నారు. సమావేశంలో షేక్ బాబు, జి.పుల్లారెడ్డి, ఆర్.ప్రతాప్‌బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

పనులకు కావాల్సిన ఇసుక తెప్పించుకోండి

- పాఠశాలల్లో నాడు-నేడుపై సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్
- పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పాఠశాలల్లో నాడు- నేడు కింద చేస్తున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులుతో బుధవారం సమీక్షించారు. మండలాల వారీగా డివిజన్ వారీగా సమస్యలు ఏమైనా ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. జయప్రకాష్ పవర్ వెంచర్ స్టాక్ పాయింట్ నుండి స్కూల్ స్టాక్ పాయింట్ వరకు ఇసుకను అవసరం మేరకు తరలించి పనులను వేగవంతం చేయాలని, ఫొటోలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి ఎప్పటికప్పుడు నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. పనులను నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, కూలీల వేతనాలు ఇనుప, రేకులు పనులు చేసే కూలీలకు సంబంధించి వేతనాలను నిర్ధారించే విధంగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని చెప్పారు. రివాల్వింగ్ ఫండ్ నిధులను సక్రమంగా వినియోగించాలని, ఇంకా రివాల్వింగ్ ఫండ్ పడని స్కూల్ వివరాలను సేకరించి నిధులు జమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో పనులు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్య, జిల్లా ఇసుక అధికారి విజయకుమార్, సర్వ శిక్ష అభియాన్ ఈజీ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

29, 30 తేదీల్లో ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా ప్రథమ మహసభను విజయవంతం చేయాలని ఆహ్వాన కమిటీ గౌరవాధ్యక్షులు జెవికెఎస్ ప్రసాదు, అధ్యక్షులు వై.సురేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజు, కోశాధికారి కె.వెంకటరత్నం కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో 21 మందితో ఆహ్వాన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతిష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తోందని, మాచర్ల ప్రాంతంలోనూ అనేక పోరాటాలు చేసిందని చెప్పారు. విద్యార్థులు, విద్యారంగం సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో చేయాల్సిన పోరాటాలకు కార్యాచరణ నిమిత్తం జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, ప్రజలంతా సహకరించాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, ఉపాధ్యక్షులు బి.మహేష్, జెవివి జిల్లా గౌరవాధ్యక్షులుక కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెవికెఎస్ ప్రసాదు

రూ.1.54 కోట్లతో 7 తరగతి గదులు

ప్రజాశక్తి - నకరికల్లు

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో వైసిపి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయ అన్నారు. మండలంలోని చేజర్ల జెడ్‌పి పాఠశాలలో నాడు-నేడు కింద రూ.1.54 కోట్లతో నిర్మించే 7 అదనపు తరగతి గదులకు మంత్రి, ఎంపీ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. అనంతరం చల్లగుండ్ల ప్రభుత్వ పాఠశాలను ఎంపి పరిశీలించారు. విద్యార్థుల శాతం తక్కువగా ఉందని, వసతులు సరిగా లేవని అన్నారు. సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని చెప్పారు. కండ్లకుంటలో పనులను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపిపి ఎం.అనురాధ, వైసిపి మండల కన్వీనర్ బి.రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ రోహిణి, కె.చందు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

2,067 ఎకరాలపై హక్కుల కోసం రీసర్వే

వి.అప్పాపురంలో ప్రారంభించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని వి.అప్పాపురంలో సుమారు 2,067 ఎకరాల ఈనాం భూమికి హక్కు కల్పించేందుకు సర్వేను బుధవారం చేపట్టారు. సర్వేను బుధవారం ప్రారంభించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ సర్వే ద్వారా గ్రామ హద్దులను నిర్ణయించి అనంతరం ప్రభుత్వ భూములను గుర్తించి అనంతరం ఆయా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు ఫారం-1 జారీ చేస్తారని చెప్పారు. రైతులు తాము సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి పత్రాలేమైనా ఉంటే అధికారులకు ఇవ్వాలని, హద్దులనూ చూపాలని చెప్పారు. వీటిపై అందరికీ తెలిసేలా అధికారులు నోటీసులు జారీ చేసి, అభ్యంతరాలు వస్తే వాటిని పరిష్కరించి ఆ తర్వాత రైతుల భూమలుకు హద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. ప్రతి రైతుకూ సర్వే నంబర్ కేటాయిస్తారని, సర్వేకు సంబంధించిన ఎఫ్ఎల్ఆర్‌ను రూపొందించిన అనంతరం ఆర్ఒర్‌ను రూపొందిస్తారని తెలిపారు. వీటిపైనా అభ్యంతరాల స్వీకరణకు వివరాలను ప్రజలకు బహిరంగ పరుస్తారని, అభ్యంతరాలను పరిష్కరించి ఆర్ఎస్ఆర్‌లో నమోదు చేస్తారని, దీని ద్వారా రైతుల భూముల స్థల హద్దులు పూర్తిస్థాయిలో నిర్ణయిస్తారని వివరించారు. అనంతరం ప్రభుత్వ అనుమతి మేరకు పట్టాలిస్తారని, పట్టాలు పొందిన రైతుల పేర్లను వెబ్ ల్యాండ్‌లో నమోదు చేస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఈనాం, అగ్రహారం భూములున్నాయని, వాటిని సాగు చేస్తున్న రైతులకూ హక్కులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి జయరామిరెడ్డి, జెడ్పిటిసి జె.సుబ్బరామయ్య, వైసిపి మండల అధ్యక్షులు ఎన్.నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు పిచ్చిరెడ్డి, తహశీల్దార్ మధుబాబు, ఎంపిడిఒ జిలాని బాష, సర్పంచ్ పాల్గొన్నారు.

సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఛార్జీల భారం.. ఇసుక బంగారం..

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించలేని దద్దమ్మ వైసిపి ప్రభుత్వమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు విమర్శిం చారు. ప్రజలకు షాక్ కొట్టేలా విద్యుత్ ఛార్జీలు పెంచి దోచుకుంటున్నారని మండిపడ్డారు. మండలంలోని కొప్పుకొండ తండా, గణేషునిపాలెంలో బుధవారం బాదుడే - బాదుడు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువులు, ఆర్టీసీ చార్జీలను భారం చేశారని, ఇసుక బంగారం చేయడంతోపాటు కొరత సృష్టించి ఇష్టానుసారం దోచుకుంటున్నారని ఆరోపించారు. ఏ గ్రామం వెళ్లిన డ్రైనేజీ సదుపాయం లేదని, అధ్వాన పారిశుధ్యంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. పంటలకు మద్దతు ధరలు దక్కడం లేదని, వర్షాలు, తెగుళ్లతో పైర్లు దెబ్బతిన్నా సాయం ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదని విమర్శించారు. నష్టాల పాలై ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలనూ ఆదుకోని దుర్మార్గ ప్రభుత్వం అధికారంలో ఉందని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సిఎం మాత్రం ప్యాలెస్‌లో ఉండి చోద్యం చూస్తున్నారని, ఈ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.కాసిం, నాయకులు ఎం.రామబ్రహ్మం, ఎం.ఏడుకొండలు, సిహెచ్.ప్రసాదు, కె.వెంకట నరసయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటిస్తున్న జీవీ ఆంజనేయులు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కాలపరిమితి ఎత్తివేయాలి

డిబిఆర్‌సి కన్వీనర్ దేవకుమార్

ప్రజాశక్తి-గుంటూరు : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కాలపరిమితి నిబంధన ఎత్తివేసి, ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి చెందే వరకూ కొనసాగించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ కోరారు. బుధవారం అరండల్‌పేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023తో చట్టానికి పదేళ్ల కాలపరిమితి ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో గత నెలలో విజయవాడలో దళిత బడ్జెట్ వాచ్ ఆధ్వర్యంలో పలు దళిత ప్రజా సంఘాలు సమావేశమై సబ్ ప్లాన్ చట్టాన్ని శక్తివంతం చేయటానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. దేశంలో ఏ చట్టానికి లేని విధంగా సబ్‌ప్లాన్‌కు మాత్రం పదేళ్ల కాలపరిమితి విధించటం సరికాదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్లాన్, సబ్‌ప్లాన్ పదాలు లేనందున ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కూడా తెలంగాణలో మాదిరిగా ప్రత్యేక అభివృద్ధి నిధిగా మార్చాలని సూచించారు. సాధారణ పథకాలతో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరగదని, ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ సబ్ ప్లాన్ నిధులు ద్వారా వేల కోట్లు ఖర్చు చేసినా దళిత, గిరిజనుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఉన్నంత కాలం సబ్ ప్లాన్ కొనసాగించాలన్నారు. సమావేశంలో డిబిఆర్‌సి ప్రతినిధులు డాక్టర్ ఉమా మహేశ్వరరావు, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దేవకుమార్

నెక్కల్లు లో చీపుర్లు పట్టి నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

నెక్కల్లులో చీపుర్లతో నిరసన

24వ రోజుకు రాజధాని పారిశుధ్య కార్మికుల ఆందోళనలు

ప్రజాశక్తి - తుళ్లూరు : మూడు నెలల పెండింగ్ జీతం, పని భద్రత కోసం రాజధాని 29 గ్రామాలలోపారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరసనలు బుధవారం నాటికి 24 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నెక్కల్లులో చీపుర్లు పట్టి కార్మికులు నిరసన తెలిపారు. నాల్గవ నెల గడుస్తున్నా ఇప్పటికీ జీతాలు ఇవ్వలేదని, అప్పులు కూడా పుట్టక అర్ధాకలితో పారిశుధ్య పనుల ఎచేస్తున్నమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో పూజల కొండమ్మ, రామాంజనేయులు, దుర్గ, వేంకటేశ్వరరావు, ఏడుకొండలు పాల్గొన్నారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి, అధ్యక్షులు చెరుకూరి సుశీల, కార్యదర్శి రాచూరి వేణు పారిశుధ్య కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలుచెల్లించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కోర్టు ఆవరణలో న్యాయ సేవాదినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు లీగల్ : జాతీయ న్యాయ సేవా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. న్యాయ సేవా సదన్ నుంచి నగరంపాలెం మెయిన్ రోడ్డు వరకూ సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్ధ సారధి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం న్యాయ సేవా సదన్ కార్యాలయంలో జరిగిన వేడుకలలో పార్ధ సారధి మాట్లాడుతూ 2022 నవంబర్ 12న నిర్వహిచబోయే జాతీయ లోక్ ఆదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగించు కోవాలని, అర్హులైన వారు న్యాయ సేవాధికార సంస్థలు అందించే ఉచిత న్యాయ సహాయం వినియోగించు కోవాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నకుమార్ లోక్ అదాలత్ ఆవిర్భావం, ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాలలో మొదటి అదనపు జిల్లా న్యాయ మూర్తి వేణుగోపాలరావు, 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రామ గోపాల్, ఏపీ బార్ కౌన్సెల్ మెంబెర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నకుమార్ జిల్లా జైలు సందర్శించి రిమాండ్ ఖైదీలకు అవసరమైతే న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు.

వేద సీడ్స్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక నెహ్రూనగర్‌లోని కోదండ రామాలయంలో వేదసీడ్స్ ఆధ్వర్యంలో దీక్ష స్వీకరించిన స్వాములకు ఏర్పాటు చేసిన చద్ది కార్యక్రమాన్ని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ అన్ని దానాల్లోనూ అన్నదానం మహా పుణ్యమన్నారు. నగరంలో జరుగుతున్న అన్నదాన కార్యక్ర మాలకు దాతల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. అన్నదాన కార్యక్రమాల్లో యువత ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టెం లక్ష్మణ్, డాక్టర్ కంతా జగదీష్, వేద సీడ్స్ సిబ్బంది తోట రంగారావు, నీలం శివరామకృష్ణ, ఇక్కుర్తి వెంకటేష్, గాజుల సాయిరాం పాల్గొన్నారు.

అరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి

ప్రజాశక్తి-గుంటూరు : మనిషికి ఎముక బలం ఉంటేనే సమాజంలో మనం వేగంగా ముందుకు వెళ్లగలమని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి అన్నారు. నీరీప్లేస్‌మెంట్‌లో పేరున్న సాయి భాస్కర హాస్పిటల్‌ను ఆయన బుధవారం సందర్శించారు. డాక్టర్ నరేంద్రరెడ్డి, కుటుంబ సభ్యులు స్వామీజికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజి మాట్లాడుతూ పరుగెడుతున్న సమాజాన్ని అందుకోవాలంటే మన శరీరం ఎంతో అవసరమని, ఆసుపత్రులు రోగులకు ప్రేమతో సేవలు అందిస్తున్నారన్నారు. శారదా పీఠంతో నరేంద్ర రెడ్డి కుటుంబానికి అనుబంధం ఉందని పేర్కొన్నారు. బిఎంఆర్ ఆసుపత్రి ఛైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ శారదా పీఠంకు, బిఎంఆర్ సంస్థకు ఒక అనుబంధం ఉందన్నారు. డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ స్వామిజీ హాస్పిటల్‌ను సందర్శించి మాలో నూతన స్ఫూర్తి నింపారన్నారు.

విద్యార్థులు స్వీయ అన్వేషణ అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న శివ

విద్యార్థులకు తమ లక్ష్య సాధనకు నిరంతర స్వీయ ఆవిష్కరణలు అవసరమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో క్లబ్ షఫైర్ (స్పైసెస్) స్టూడెంట్ క్లబ్‌లో భాగంగా నూతనంగా చేరిన అన్ని విభాగాల మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వీయ అన్వేషణ, అభివృద్ధి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆర్‌సి ఆల్‌టెక్ పవర్ సిస్టం ప్రైవేటు లిమిటెడ్ ఎండి వి.టి.శివ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల లక్ష్య సాధనకు అవసరమైన సృజనాత్మకతను, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవటానికి అవసరమైన పద్ధతులను వారికి వివరించారు. ప్రతి విద్యార్థి నూతన విషయాలను శోధించటం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అందుకు ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృదా చేయకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

14న కౌలు రైతు సంఘం జిల్లా మహాసభ

జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి-తెనాలి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో 14వ తేదీన జరిగే ఎపి కౌలు రైతు సంఘం 3వ జిల్లా మహాసభను పెద్ద సంఖ్యలో రైతు, కౌలు రైతులుపాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు. రూరల్ గ్రామాలైన గుడివాడ, కోపల్లె, అంగలకుదురు, సంగం జాగర్లమూడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడారు. 2011 రైతు చట్టాల స్థానంలో 2019 చట్టాన్ని తెచ్చినా రైతులకు ఏ మాత్రం మేలు జరగలేదన్నారు. పంట రుణాలు, కౌలు రైతు గుర్తింపు కార్డులు, పంట నష్ట పరిహారం వంటి సమస్యలపై జిల్లా మహాసభలో చర్చ జరుగుతుందని, రైతులు పాల్గొని సభను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో బండి సుధాకర్, బి.భాస్కరరావు, బేతాళ దావీదు, కె.వరదయ్య, ఎన్.తులసీనాయక్, ఆర్.జగజ్జీవన్‌రామ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివ సాంబిరెడ్డి

నేడు పెదనందిపాడులో రైతు సదస్సు

జయప్రదం చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో పలు మండలాల్లో ప్రచారం

ప్రజాశక్తి - పెదనందిపాడు : గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని, భూ సేకరణకు నిధులు వెంటనే కేటాయించాలని, రైతు,కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పెదనందిపాడు పాతబస్టాండ సెంటర్‌లో గురువారం జరిగే రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ, బుధవారం ఆటో ప్రచార జాతాను నాయకులు చుక్కా యానాదులు, డి రమేష్‌బాబు, మద్దూరి రమణ, కె శ్రీనివాసరావు, పి రమేష్, కె శివరావు నిర్వహించారు. పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల్లోని నాగులపాడు, పుసులూరు, కట్రపాడు, నందిపాడు, పాలపర్రు, పరిటాల వారిపాలెం, అన్నారం, కాకుమాను మండలంలోని కొమ్మూరు, గార్లపాడు, కొండపాటూరు, కాకుమాను, పర్చూరు మండలంలోని చిననందిపాడు, అడుసుమల్లి, ఇనగల్లు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహన్‌రావు, మాజీ ఎంపిపి నర్రా బాలకృష్ణ తదితరులుపాల్గొంటారని నాయకులు కాకుమాను నాగేశ్వరరావు తెలిపారు.

గార్లపాడులో ఆటో ప్రచార జాతా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

గర్భిణి కడుపులో గడ్డి మందు

కాలిపోయిన పేగులు - ఆరోగ్యం విషమించడంతో వెంటిలేటర్‌పై వైద్యం - ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

ప్రజాశక్తి - నరసరావుపేట

వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న శ్రావణి

అస్వస్థతకు గురైన ఆరు నెలల గర్భిణిని వైద్య పరీక్షలకు తీసుకెళ్లగా ఆమె కడుపులో విషం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే తానేమీ విషం తీసుకోలేదని బాధిత గర్భిణి చెబుతుండగా తమకూ తెలీదని అత్తింటివారు అంటున్నారు. అయితే ఇది అత్తింటి వారి పనే అని గర్భిణి తల్లిదండ్రులు అనుమానిస్తున్నారు. బాధితురాలు రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరగా గురువారం మీడియా ద్వారా సంఘటన వెలుగుచూసింది. సేకరించిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం సుబ్బయ్యపాలేనికి చెందిన గాడిపర్తి వేణుకు బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొప్పెరప్పాడుకు చెందిన గంగవరపు శ్రీనివాసరావు శివపార్వతి దంపతుల పెద్ద కుమార్తె శ్రావణితో 2020లో వివాహమైంది. వీరికి 2021లో పాప పుట్టింది. మళ్లీ గర్భం దాల్చి 6 నెలలు కావడంతో ఇటీవల ఆమెను నరసరావుపేటలోని ఒ ప్రైవేటు ఆస్పత్రిలో భర్త పరీక్షలు చేయించాడు. పరీక్షల అనంతరం ఇంటికి అవసరమైన సరుకులు తీసుకుని ఇద్దరూ వెళ్లిపోయారు. కొద్దిరోజులకే శ్రావణి అస్వస్థతకు గురికావడంతో ప్రతిసారీ తీసుకెళ్లే ఆస్పత్రికే తీసుకెళ్లి చూపించారు. ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు లేవని, మరో ఆస్పత్రికి వెళ్లాలని వైద్యుల సూచనతో వేరే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె కడుపులో విషం (గడ్డి మందు) ఉందని, పేగు వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని విషమంగా మారిందని చెప్పారు. అనంతరం మెడికల్ లీగల్ కేసుగా భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ లోగా శ్రావణి పరిస్థితి విషమంగా ఉందనే విషయం ఆమె తల్లిదండ్రులకు తెలిసి వారూ ఆస్పత్రికి వచ్చారు. ఇంత పని ఎందుకు చేశావని శ్రావణిని తల్లిదండ్రులు అడగాగా తామేమీ తీసుకోలేదని చెప్పింది. అత్తింటి వారిపై అనుమానాలు వ్యక్తం చేయగా వారి ప్రమేయమూ లేదని, వారు తనను బాగా చూసుకుంటున్నారని తెలిపింది. అయితే బాధితురాలి వాగ్మూలం కోసం పోలీసులు రావడంతో శ్రావణి తల్లిదండ్రులే ఫిర్యాదు చేసి ఉంటారని భావించిన వేణు కుటుంబీకులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో శ్రావణి తల్లిదండ్రులు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టిందని, రెండో కాన్పులోనూ ఆడపిల్లేనని తెలిసి ఇలా చేసి ఉంటారని అత్తింటి వారిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు శ్రావణి కడుపులో పేగులన్నీ కాలిపోవడంతో పరిస్థితి విషమంగా ఉంది. వెంటిలేటర్‌పై చికిత్స అందించి, రాత్రికి విజయవాడకు తరలించారు.

గర్భిణీ విషయంలో స్పందించిన ఎషియన్ వైద్యులు

నరసరావుపేట పట్టణంలోని వినుకొండ రోడ్డులో ఉన్న ఎషియన్ హాస్పట్‌లో గర్భిణి శ్రావణికి లింగనిర్ధారణ పరీక్షలు చేశామంటు సోషల్‌మీడియాలో వస్తున్న వార్తల్ని బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో హాస్పిటల్ యాజమాన్యం, గైనకాలజిస్ట్ డాక్టర్ కొండారెడ్డి త్రివేణి ఖండించారు. ఈనెల 2వన శ్రావణికి సాధారణ పరీక్షలు నిర్వహించామని ఆమె పరిస్థితి బాగనే ఉందని కుటుంబ సభ్యులకు తెలిపామన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేశామని అసత్య ప్రచారాలు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

అలా పేర్లు పెట్టినంత మాత్రాన జాతకం మారదు

- విద్య, విజ్ఞానం ద్వారానే పురోగతి సాధ్యం
- స్పేస్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ఆన్ రాకెట్ సైన్స్‌లో పల్నాడు కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గ్రహ స్థితి ఆధారంగా పేర్లు పెట్టడం ద్వారా వారి జాతకాలు బాగుంటాయని అనుకోవడం సరికాదని, విద్య, విజ్ఞానం పెంచుకోవడం ద్వారానే పురోగతి సాధ్యమని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ అన్నారు. పట్టణ సమీపంలోని గీతిక సిబిఎస్ఇ పాఠశాలలో స్పేస్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ఆన్ రాకెట్ సైన్స్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ ఇస్రో మాజీ శాస్త్రవేత్త శివప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ గ్రహాలు, సిద్ధాంతాలు, మహాభారతం, రామాయణం అంశాలను వివరించారు. పాఠశాలలో రోబోటిక్, మ్యాథమెటిక్స్ ల్యాబ్‌లను ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన రోబోలు వాటి పనితీరును పరిశీలించారు. రోబోలు నిజజీవితంలో చేస్తున్న పనులపై విద్యార్థులను పలు

నమూనాలపై విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటే 5 డబ్ల్యు సిద్ధాంతం తప్పక పాటించాలని సూచించారు. పాఠ్యాంశాలను బోధించే ఉపాధ్యాయులను అడిగి తమకున్న అనుమానాలను విద్యార్థులు నిరంతరం నివత్తి చేసుకోవాలన్నారు. గతంలో తాము చదువుకుంటున్నా రోజుల్లో పుస్తకాలన్నీ బ్లాక్ అండ్ వైట్ రంగుల్లో ఉండేవని, ప్రస్తుతం రంగుల పేజీలలో ఆకర్షణీయంగా వస్తున్నాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలతో పాటు సామాజిక, నైపుణ్యం, విజ్ఞానం కలిగించే పుస్తకాలను చదువుతూ ఉండాలని, పుస్తకం పఠనం చేసే విద్యార్థుల్లో నైపుణ్యం మరింత మెరుగుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా సీఈవో శాంతమూర్తి, గీతిక సిబిఎస్ఇ స్కూల్ కరస్పాండెంట్ బాలగంగాధరరెడ్డి, డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, తాహశీల్దార్ కెవిఎస్ చక్రవర్తి, ఎంపిడిఒ కాశయ్య పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణ పల్లిలోని జెడ్‌పి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలోనూ కలెక్టర్ పాల్గొన్నారు.

హరగోవింద్ ఖొరానా చిత్రపటం వద్ద నివాళులర్పింస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు

జెనెటిక్ ఇంజినీరింగ్‌కు నాంది పలికిన హరగోవింద్ ఖొరానా

ప్రజాశక్తి - అమరావతి

ప్రఖ్యాత జీవ శాస్త్రవేత్త హరగోవింద్ ఖొరానా వర్ధంతి సందర్భంగా మండలంలోని మునుగోడు జెడ్‌పి పాఠశాలలో నివాళులర్పించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖొరానా పరిశోధనలు ఆధునిక జీవశాస్త్రములో విప్లవాన్ని తెచ్చాయని చెప్పారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు డి.పద్మావతి మాట్లాడుతూ వంశపారంపర్యంగా సంక్రమించే జీవనిర్మాణానికి దోహదం చేసే 'కృతిమ జీన్'ను ఆవిష్కరించి జెనెటిక్ ఇంజినీరింగ్ అనే నూతన శాస్త్ర అధ్యయనానికి ఖొరానా నాంది పలికారని వివరించారు. కార్యక్రమంలో పెరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలివిడతగా 199 గృహాలకు జియోట్యాగింగ్

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రధాన మంత్రి గ్రామీణ యోజన పథకం కింద తొలి విడతగా 199 గృహాలకు జియోట్యాగింగ్ చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ ఎఇ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండలానికి 707 గృహాలు మంజూరు కాగా ఒక్కో గృహానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇస్తుందని, సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.

మాట్లాడుతున్న జడ్జి మహమ్మద్ గౌస్

75 తాళ్లూరులో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - పెదకూరపాడు

జాతీయ న్యాయ సేవ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని 75 తాళ్లూరులో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. లోక్ అదాలత్, వివిధ చట్టాలపై సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ వివరించారు. కార్యక్రమంలో పెదకూరపాడు ఎస్ఐ కృష్ణారావు, ప్యానెల్ అడ్వకేట్లు అమర నాయక్, వెంకట శివ, పారా లీగల్ వాలంటీర్లు సుభాని, ముబారక్, కాజా, విజయ గోపాల్ పాల్గొన్నారు.

ముప్పరాజువారిపాలెంలో గడపగడపకు

ప్రజాశక్తి - నూజెండ్ల : మండలంలోని ముప్పరాజువారిపాలెంలో గడపగ డపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండోరోజైన బుధవారం నిర్వహించగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ప్రచారం నిర్వహించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, దీన్ని సహించలేని ప్రతిపక్షం విమర్శలు చేస్తోందని అన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేగా వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. కార్యమ్రకంలో ఎంపిపి ఎం.జయరాంరెడ్డి, తహశీల్దార్ మధుబాబు, ఎంపిడిఒ జిలాని బాషా పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

డిఇఒ, మున్సిపల్ కమిషనర్‌కు యుటిఎఫ్ వినతిపత్రాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్రకు బుధవారం వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలను మున్సిపల్ శాఖ ఇస్తుందని, అయితే వారికి మెటర్నీటి సెలవులు, ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్లు మంజూరు అధికారం మున్సిపల్ శాఖ పరిధి నుండి విద్యాశాఖ అధికారులకు ఇచ్చారని పేర్కొన్నారు. ఎంఇఒల వద్ద ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ల సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్రనూ కలిసి వినతిపత్రం ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు విడుదల చేయాలని, సెలవులు, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద రావాల్సిన ఇంక్రిమెట్లను ఇవ్వాలని కోరారు. కార్యక్రమాల్లో యుటిఎఫ్ పల్నాడు జిల్లా సహాధ్యక్షులు ఎన్.సుందరరావు, కార్యదర్శి ఎం.మోహన్‌రావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్ఎంఎ గఫార్, శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు ఒ.కోటేశ్వరరావు, సిహెచ్ సంపత్‌కుమార్, కె.వెంకటేశ్వరరావు, ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఐ సుభాషిణి

పోలీస్ స్టేషన్‌కు రాకున్నా సాయం..

ప్రజాశక్తి - నకరికల్లు : మండలంలోని దేచవరం మోడల్ స్కూల్ విద్యార్థులకు దిశ యాప్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నరసరావుపేట దిశ పోలీస్‌స్టేషన్ సిఐ సుభాషిణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పోలీసుల అవసరం ఉంటే స్టేషన్‌కు వచ్చే పని లేకుండా దిశ యాప్ ద్వారా లేదా 100 ద్వారా ఫోన్ చేస్తే స్పందిస్తారని వివరించారు. విద్యార్థులంతా నీతి, నిజాయితీ, నైతిక విలువలు కలిగి ఉండాలని చెప్పారు. మహిళలు, పెద్దలు, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. యుక్త వయసులో ప్రేమ, ఆకర్షణలకు దూరంగా ఉండాలని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో దిశ ఎస్ఐ సుబ్బారావు, ప్రిన్సిపల్ వేళంగిని మేరీ, ఉపాధ్యాయులు, దిశా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటరెడ్డికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : విజయపురిసౌత్‌కు చెందిన వైసిపి సీనియర్ నాయకులు అల్లు వెంకటరెడ్డి ఇటీవల మృతి చెందగా బుధవారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలేసి నివాళు లర్పించారు. వెంకటరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఎస్.గోపిరెడ్డి, బి.శ్రీను, పి.సుజాత కోటిరెడ్డి, ఎస్.వీరారెడ్డి, సర్పంచ్ జె.వెంకట్రామయ్య, సాగర్ డిఇ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలి

అట్లూరి శాంతి పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని ఎంఎం రెడ్డి విద్యా సంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అట్లూరి శాంతి పుట్టినరోజు సందర్భంగా బుధవారం పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయగా, గాంధీ పార్క్ వద్ద దుప్పట్లు పంపిణీ అన్నదానం చేశారు. లిటిల్ హార్ట్స్ అనాథాశ్రమంలో పిల్లలకు అవసరమైన వస్తువులు, మదర్‌థెరిస్సా వద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారం అందించారు. రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అట్లూరి శాంతి మాట్లాడుతూ తమ కళాశాలలు విద్యార్థులకు విద్యతోపాటు సమాజ సేవ, సామాజిక స్పృహ కలిగి ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. తన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. తమ కళాశాలలో విద్యలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు, విశ్రాంత అధ్యాపకులకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ్ భూషణ్‌రావు, అధ్యాపకులు లక్ష్మి సురేఖ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం, ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎంఎం రెడ్డి విద్యా సంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
గురువారం 10 నవంబర్ 2022

వ్యక్తిత్వ వికాసం పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి తెనాలి రూరల్

స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్లో బుధవారం 9,10 తరగతుల విద్యార్థులకు వ్యక్తిత్వవికాశం పై అవగాహన కల్పించారు. వార్డు కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర చొరవతో ప్రముఖ మోటివేటర్ కాళేపల్లి గౌరీశంకర్ విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల దశలో 9, 10 తరగతులు ఎంతో కీలకమైనవన్నారు. చదువుపై పట్టుదల ఉండాలన్నారు. మంచి లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వించే విధంగా చదవాలన్నారు. ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకున్నవారి జీవిత విశేషాలను పవర్పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బి.వెంకట్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న శేషమాంబ

పాల ఉత్పత్తితో మహిళలకు చేయూత

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

రైతులు వ్యవసాయంతో పాటు పశుసంపద ద్వారా పాల ఉత్పత్తిని వృద్ధి చేసుకోవాలని, దీంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి కావచ్చునని ఎంపిడిఓ బి. శేషమాంబ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆరమండ, మన్నవ గ్రామాలలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో శేషమాంబ మాట్లాడుతూ ప్రధానంగా మహిళలు దీనిపై దృష్టి సారించాలని తద్వారా మహిళా సాధికారిక సాధించవచ్చు అని ఆమె పేర్కొన్నారు. భవనం పద్మలీల ,గ్రామ సర్పంచి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,పాలవెల్లువ కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ రైతులు అధికారులు పాల్గొన్నారు.

ఎన్సిసిలో చేరిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న కర్నాల్

ఆర్మీ ఉద్యోగ సాధనకు ఎన్సిసి దోహదం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

విద్యార్థులు ఎన్సిసిలో చేరడం వలన క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు, విలువలు పెరుగుతాయాని, ఆర్మీ ఉద్యోగాలు సాధించడానికి ఎంతో దోహదపడుతుందని ఎన్సిసి అధికారి కెప్టెన్ పాతూరి శ్రీనివాస్ అన్నారు. బుధశారం పెదనందిపాడు పిఎఎస్ కళాశాలో 2022-23 సంవత్సరానికి ఎన్సిసిలో చేరే నూతన విద్యార్థులకు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్సిసి శిక్షణ పొందిన ఎంతో మంది విద్యార్థులు ఆర్మీలో ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. 23 ఏ బెటాలియన్ ఎన్సిసి చీరాల కమాండింగ్ ఆఫీసర్ కర్నాల్ సునీల్గౌరీ ఆదేశాల మేరకు బిహెచ్ఎం పి. ఢిల్లేశ్వరరావు హవాల్దార్ రిషిపాల్ ఎన్సిసిలో నూతన విద్యార్థుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాలలో ఎన్సిసి అభివృద్ధికి సహకరిస్తున్న కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కాళహస్తి సత్యనారాయణ, లావు రత్తయ్య, ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె ప్రతాప్ కుమార్లకు ఎన్సిసి కెప్టెన్ పాతూరి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు

సిపిఎం నాయకులు చౌక్కా ఆశీర్వాదం 26 వర్ధంతి

చౌక్కా ఆశీర్వాదం సూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

సిపిఎం నాయకులు, ప్రాతూరు గ్రామ మాజీ సర్పంచ్ చౌక్కా ఆశీర్వాదం 26వ వర్ధంతి కార్యక్రమం బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులోనీ సిపిఎం కార్యాలయం వద్ద జరిగింది. ముందుగా అమరజీవి చౌక్కా ఆశీర్వాదం స్తూపానికి సిపిఎం ప్రాతూరు గ్రామ శాఖ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్ర బాబు మాట్లాడుతూ ఆశీర్వాదం సిపిఎం పట్ల నిబద్ధత కలిగి పని చేశారని అన్నారు. అదేవిధంగా గ్రామంలోని పలు అభివృద్ధి పనులలో అమరజీవి డోకిపర్తి చలపతిరావుతో గ్రామ శాఖ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డోకిపర్తి కోటయ్య, పుల్లగూర సుబ్బారావు, చౌక్కా మరియదాసు పాల్గొన్నారు.

వరిలో దోమ,ఎండు పోడ నివారణకు చర్యలు

ప్రజాశక్తి-తెనాలి

వరిలో దోమ, ఎండు పోడ నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా ఉపసంచాలకులు పి. రామాంజనేయులు అన్నారు. బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలసి నేలపాడు, ఐతానగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వరిపోలాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రస్తుతం వరి బుర్రుపొట్ట , ఈనిన, గింజ పాలు పోసుకునే దశలో ఉన్నాయన్నారు. వరిలో సుడిదోమ, తెల్లదోమ, ఉందని పంట ఎండిపోతుందని అన్నారు. దీనికి కారణం పురుగు మందుతో కలిపి ఎసిటా మిప్రిడ్, డయోమెథాన్సమ్ వంటి మందుల వాడకమేనని తెలిపారు. ఈ దోమ, ఎండు పొడను అరికట్టాలంటే దుబ్బుకు 15 నుంచి 20 దోమల ఉన్నట్లయితే వారం వ్యవధిలో రెండు సార్లు ఎకరాకు డైనోటిఫెరాన్ (టోకెన్)ను 80 గ్రాములు చల్లాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ పరిశోధనాకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సాంబశివరావు, గుంటూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జి.కిషోర్బాబు, శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత, గుంటూరు డిఆర్సి ఏడిఏ జి.ప్రవీణ్, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్సాగర్, ఏఈఓలు వ్యవసాయ సహాయకులు జి.మోహన్, శివతేజ, హర్షిష్ వర్మ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

చేబ్రోలు: చేబ్రోలులో జిల్లా వనరుల కేంద్రం,శాస్త్రవేత్తల బృందం వరి పొలాలను పరిశీలించారని మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాస నాయక్ తెలిపారు.వరి పైరులో ఆకు చుట్టు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని దీని నివారణకు రసాయనిక ఎరువులు క్లోరిన్ ట్రనిలిప్రోల్ (కొరాజన్) 0.3 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసి వాడాలని అన్నారు.అగ్గితెగులు, మెడవిరుపు తెగులు నివారణకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎన్ సాంబశివరావు, కీటక శాస్త్ర జి కిషోర్ బాబు, డిఏటిటిసి కో-ఆర్డినేటర్ లాం గుంటూరు సిహెచ్ శ్రీలత వాణి, విస్తరణ శాస్త్రవేత్త నిపుణులు పి రామాంజనేయులు, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డిటిఎమ్ఎ గుంటూరు జిబిపి ప్రవీణ, ఏడిఏ జిల్లా వనరుల కేంద్రం కే సునీత, వ్యవసాయ విస్తరణాధికారి చేబ్రోలు ఎం. ప్రవీణ్ కుమార్లు పాల్గొన్నారు.

ఇప్పటంలో వైయస్సార్ రెండో విగ్రహం తొలగింపు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని ఇప్పటంలో బుధవారం ఉదయం ప్రధాన రహదారిలో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి రెండో విగ్రహాన్ని, తాము స్వచ్ఛందంగా తొలగించడం జరిగిందని వైసిపి తాడేపల్లి మండల యువజన విభాగం అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం, ఎన్టీఆర్ విగ్రహం అనేది కాకుండా, అవసరమైతే గ్రామంలోని ప్రజలు అందరం కూర్చుని మాట్లాడుకొని, దేవాలయాలను కూడా స్వచ్ఛందంగా తొలగించుకుంటామని, ప్రత్యా మ్నాయంగా మరో స్థలంలో ఏర్పాటు చేసుకుంటామని అన్నారు. రాజశేఖర్ రెడ్డి విగ్రహం తొలగింపు ఎవరికో భయపడి కాదని, తామే స్వచ్ఛందంగా తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రూ.1.27 కోట్లతో ఈమని రోడ్డుకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి -దుగ్గిరాల

రూ. 1.27 కోట్లతో ఈమని నుంచి పేరుకులపూడి వరకు నిర్మించనున్న రోడ్డుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఒక్క రూపాయి అవినీతి లేకుండా జనవరి నుండి పూర్తి స్థాయిలో రోడ్లను అభివృద్ధి చేస్తామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కేటాయిచిన రూ.2కోట్ల నిధులను మండలా అభివృద్ధికి కేటాయించినట్లు ఆయన తెలిపారు. సిసి రోడ్లు, తారు రోడ్లు, డ్రైనేజిల కోసం మరో రూ. 50 కోట్లు నిధులకు సిఎం ఆమోధించారని తెలిపారు.ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావు మాట్లాడుతూ రైతుల ఇబ్బందులు లేకుండా డొంక రోడ్లను సైతం అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం పెనుమూలి నుండి నంబూరు వరకు 2.20 కోట్ల నిర్మించిన రోడ్డును, చిలువూరు నుండి నంబూరుకు వరకు 2.50 కోట్లతో నిర్మించిన రోడ్లను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి డి. సంతోష రూపవాణి, జెడ్పిటిసి ఎం. అరుణ, యార్డ్ చైర్మన్ షేక్ బాజీ , మాజీ చైర్మన్కె. ముత్తయ్య, సర్పంచులు పి.కృష్ణ, ప్రసాద్, సి. శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ సుజాత

ఆర్బికెల్లో ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - చేబ్రోలు

వరి ధాన్యం కొనుగోలును ఈ నెలాఖరునాటికి రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభిస్తున్నట్లు మండల తహశీల్దార్ సుజాత తెలిపారు. మండల వ్యవసాయాధికారి బి. శ్రీనివాస్ నాయక్ బుధవారం సంబంధిత ఉద్యోగులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ సుజాత మాట్లాడుతూ వరి పంట కోత సమయానికి ధాన్యం కొనుగోలు అందుబాటులో ఉంటుందన్నారు. వరి కనీస మద్దతు ధర ఏ-1 గ్రేడ్కు రూ.2060గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రతి రైతుభరోసా కేంద్రానికి ముగ్గురు వాలంటీర్లు నియమించామని, వాలంటీర్లు రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. దాన్యం వే బ్రిడ్జి కాటా నిర్వహణ , రైసు మిల్లుల వరకు ధాన్యం చేర్చే వరకు బాధ్యత తీసుకుంటారని అన్నారు. రైతులు దాన్యం అమ్మిన 21 రోజులలో రైతు ఆధార్ లింక్ చేసిన ఖాతాలో డబ్బులు జమ అవుతాయని అన్నారు.

శివప్రసాద్ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రంగస్థల నటుడు శివప్రసాద్కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్రోడ్డులోని పెమ్మసాని థియేటర్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎన్టీఆర్ నటించిన సర్కస్ రాముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు.అలాగే రోజుకో కళాకారుడిని సత్కరిస్తున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు కేసంశెట్టి శివప్రసాద్ను ఉత్సవ కమిటీ సభ్యులు కె.రవికుమార్, వి.నరసయ్య, వి.రమేష్, వెంకటేశ్వర్లు, ఎన్.లింగయ్య సత్కరించారు. కార్యక్రమంలో సువర్చలరాజు, సమరసబాబు, పులివర్తి రాజు, పి.పోతురాజు, ఎం.రాఘవరావు, ఎం.కోటేశ్వరరావు, ఎన్.శ్రీనివాస్, ఎం.శ్రావణ్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఆర్టిసి సిబ్బంది

కవి,రచయిత ఆళ్ల నాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ళ నాగేశ్వరరావును ఆర్టిసి గుంటూరు-2 డిపో సిబ్బంది బుధవారం ప్రజా రవాణా అధికారిణి కార్యాలయంలో సత్కరించారు. గుంటూరు-2 డిపోలో కండక్టర్గా పనిచేస్తున్న ఆయన సాహితీ రంగంలో విశేష సేవలందిస్తున్నారు. దానికి గుర్తింపుగా యుఎస్ ఆర్ట్స్ గ్యాలరీ వారు ఇటీవల వివిధ రంగాల్లో సేవలందించిన వారిని ఎంపిక చేసి ఇండియా టాప్ 20 పర్సనాలిటీ పురస్కారాలను అందించారు. పురస్కారాన్ని దక్కించుకున్న నాగేశ్వరరావును డిపో ఇన్చార్జి మేనేజర్ బి.పవన్, అసిస్టెంట్ మేనేజర్ ఎ.నాగమణి, రీజనల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పలువురు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పోరాట విజయం

దిగివచ్చిన ప్రభుత్వం హెల్త్ అలవెన్స్ రికవరీ నిలుపుదల

ప్రజాశక్తి - తాడేపల్లి, నరసరావుపేట

తాడేపల్లి మచ్చరపాయింటు వద్ద మాట్లాడుతున్న వేముల దుర్గారావు

మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పట్టుదలతో చేసిన పోరాటం ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి హెల్త్ అలవెన్స్ రికవరీ నిలుపుదలచేసిందని నాయకులు పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లిలో సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గా రావు, నరసరావుపేటలో సిఐటియు పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లాడుతు ఇది ముమ్మాటికి కార్మికుల విజయమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న హెల్త్ అలవెన్స్ నిలుపు దలచేయాలని ట్రెజరీ అధికారులకు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర మున్సిపల్ కార్మికుల యూనియన్(సిఐటియు) ఆందోళనకు పిలుపు నిచ్చింది. ఈ నెల 5వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఆందోళన ఫలితంగా మున్సిపల్ రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్ అధికారి, డైరెక్టర్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను నిలుపుదలచేసి యథావిధిగా మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని ఆదేశించారు. పోరాడి సాధించుకున్న మున్సిపల్ కార్మికులకు నాయకులు అభినందనలు తెలిపారు. **తాడేపల్లి** పట్టణంలోని కృష్ణనగర్, తాడేపల్లి, సీతానగరం, మహానాడు లోని మచ్చర పాయింట్‌ల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించి దుర్గారావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకరరావు, కె.వెంగమ్మ, వనమా సతీష్, ఎం.కామాక్షి, బి.కొండయ్య, ఈశ్వరమ్మ, నాని, సీమోను తదితరులు పాల్గొన్నారు. **నరసరావుపేటలో** రికవరీ రద్దుకు సంబంధించిన కాపీని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి యోహాన్, వీర కుమార్, నరసింహారావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో సత్తా చాటిన బాలికలు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక - గురుకుల విద్యార్థినులకు పలువులు అభినందన

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.బాలకృష్ణ బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8న గుంటూరు జిల్లాలోని అచ్చంపేటలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రెజ్లింగ్ పోటీలలో గెలిచి విద్యార్థినులు తమ సత్తాను చాటినట్లు తెలిపారు. ఈ పోటీలలో 62 కేజీల విభాగంలో జె.నీలిమ, 59 కేజీల విభాగంలో డి.నవ్యశ్రీ, 57కేజీల విభాగంలో జి.అఖిల, 55 కేజీల విభాగంలో ఎం.ప్రియాంకబాయి, 53 కేజీల విభాగంలో ఆర్.దేవమణి, 50 కేజీల విభాగంలో పి.హర్షిత విజేతలుగా నిలిచారన్నారు. విద్యార్థినులు అంతా రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికవడం హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ బాలకష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మిరాజ్యం, పీఈటీ జయశ్రీ, పీడీ ఎస్ కే మహబూబి అభినందించారు.

వర్సిటీలో చిత్రకళా ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల చిత్రకళా ప్రదర్శనను బుధవారం విసి పి రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను పదిమందికి తెలియజేయాలనే సదుద్దేశంతో చిత్రకళాపదర్శనను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్ఐడి డైరెక్టర్ శేఖర్ ముఖర్జీ మాట్లాడుతూ విద్యార్థుల చిత్రాలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ బి కరుణ మాట్లాడుతూ కొన్ని చిత్రాలు జీవం ఉట్టిపడే విధంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా చిత్రకళా ప్రదర్శన ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈదర శ్రీనివాసరెడ్డి తెలిపారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే గంగాధర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప రాణి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి సిద్దయ్య, ఫైన్ ఆర్ట్స్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

పల్నాడు జిల్లా యడ్లపాడులో సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

రేపు సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

తొలుత యడ్లపాడు, తర్వాత గుంటూరు నగరంలో పలు కార్యక్రమాలకు హాజరుకానున్న జగన్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 11న గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పర్యటిస్తున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా మంత్రి విడదల రజని అధికారుల్ని ఆదేశించారు. బుధవారం గుంటూరు మెడికల్ కాలేజీలో సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి 11న ఉదయం 9.25 గంటలకు యడ్లపాడు మండలం, వంకాయలపాడు గ్రామంలో స్పైసెస్ పార్క్‌కు హెలీకాప్టర్‌లో చేరుకుంటారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని 10.55 గంటలకు గుంటూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌కు వస్తారు. అక్కడి నుండి 11.10 గంటలకు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో నిర్వహించే మైనారిటీ వెల్ఫేర్ దినోత్సవంలో పాల్గొంటారు. అనంతరం 12.30 గంటలకు గుంటూరు మెడికల్ కాలేజికి వచ్చి, కళాశాలకు 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 12.45 గంటలకు పోలీసు పెరేడ్ గ్రౌండ్ హెలీప్యాడ్ వద్దకు చేరుకొని తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వెళతారు. మంత్రి వెంట పర్యటనలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, ఏపిఎంఎస్ఐడిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ వినోద్ కుమార్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే షేక్. మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

గుంటూరులో సిఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఏర్పాట్లు పర్యవేక్షించిన నగర కమిషనర్

సిఎం పర్యటనలో చేపట్టాల్సిన పనులపై పర్యవేక్షణకు నగరపాలక సంస్థ అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ పోలీసు పెరేడ్ గ్రౌండ్, నగరంపాలెం జంక్షన్, మెడికల్ కాలేజి రోడ్డు, మూడు బొమ్మల సెంటర్‌లో అభివృద్ధి పనులు, పెరేడ్ గ్రౌండ్ నుండి రమేష్ హాస్పిటల్ వరకూ జరుగుతున్న డివైడర్ పెయింటింగ్, వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్టేజి, సీటింగ్, లైటింగ్ పనులను తనిఖీ చేసి, పనుల వేగవంతంపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

రేపు గుంటూరులో ట్రాఫిక్ మళ్లింపు

సిఎం పర్యటనతో పోలీసుల ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : గుంటూరులో ఈనెల 11న సిఎం జగన్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. ఈమేరకు ట్రాఫిక్ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతి రోడ్డు, శంకర్ విలాస్,ఓవర్ బ్రిడ్జి మీదుగా బస్టాండ్, మార్కెట్‌కువెళ్లే వాహనాలను ప్రభుత్వ మహిళా కళాశాల, నాజ్ సెంటర్, జిన్నాటవర్ సెంటర్‌మీదుగా మళ్లిస్తారు. అలాగే మరో వైపు కొత్తపేట మీదుగా మరికొన్ని వాహనాలను మళ్లిస్తారు.ఉమెన్స్ కళాశాల నుంచి హిందూకళాశాల, వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వైపునకు ఎటువంటి వాహనాలను అనుమతించబోమని జిల్లా ఎస్పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. అలాగే బస్టాండ్ వైపు నుంచి హిందూ కళాశాల వైపునకు వచ్చే వాహనాలను మునిసిపల్ ఆఫీసు, పల్నాడు బస్టాండు ఎత్తు రోడ్డు మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. బస్టాండ్, మార్కెట్ నుంచి వచ్చే వాహనాలను హిందూ కళాశాల వైపునకు ఎటువంటి వాహనాలను అనుమతించబోమని తెలిపారు. అలాగే పట్టాభిపురం,కంకర గుంట బ్రిడ్జి వైపు నుంచి మార్కెట్ , బస్టాండ్‌కు వెళ్లే వాహనాలన కలెక్టర్ ఆఫీసు జంక్షన్ నుంచి కలెక్టర్ బంగ్లా రోడ్డు నుంచి మెడికల్ క్లబ్ జంక్షన్ మీదుగా మస్తాన్ దర్గా, ఎత్తు రోడ్డు వైపు మళ్లిస్తారు. కలెక్టర్ ఆఫీసు నుంచి జిల్లా కోర్టు, రమేష్ ఆస్పత్రి వైపు వాహనాలను అనుమతించబడవని తెలిపారు. సిఎం పర్యటనకు చేపట్టాల్సిన బందోబస్తు చర్యలపై ఎస్పి బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పెరేడ్ గ్రౌండ్స్ నుంచి, వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు, తరువాత మెడికల్ కళాశాల వరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేయాలన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లోని హెలిప్యాడ్ వద్ద భద్రత,సభా ప్రాంగణాల వద్దకు చేరుకోవడానికి ట్రాఫిక్ నియంత్రణ మరియు మళ్లింపు, వీఐపి రాకపోకలు సాగించే రహదారుల ఎంపిక మొదలగు వివిధ అంశాల గురించి అధికారులతో చర్చించారు.

వంకాయలపాడులో సిఎం పర్యటనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు మండలం వంకాయలపాడులో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు సంబంధించి పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడుదల రజిని పేర్కొన్నారు. శుక్రవారం వంకాయలపాడు గ్రామ సమీపంలోని స్పైసెస్ పార్క్ లో ఐటిసి రూ.250 కోట్లతో ఏర్పాటుచేసిన ప్రాసెసింగ్ యూనిట్ ను ప్రారంభించనున్నారు. మంత్రి రజనీతో పాటు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి, ఏ ఎస్ పి బిందు మాధవ్, ఐటీసీ సంస్థ ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్పైసెస్ పార్కు శంకుస్థాపన చేసి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. యూనిట్ ఏర్పాటు వలన మహిళలకు ఉపాధి అవకాశాలు అధిక సంఖ్యలో వస్తాయని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లకు సంబంధించి జిల్లా కలెక్టర్, ఎస్పి, ఐ టి సి కంపెనీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. త్వరిత గతిన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.

విజేత సూపర్ మార్కెల్ అధినేత మురికొండకు సన్మానం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

విజేత సూపర్ మార్కెట్ అధినేత మురికొండ జగన్ మోహన్ రావు, ధర్మపత్ని కష్ణవేణికి తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా ఈ యేడాది బిజినెస్ ఎక్స్ లెన్స్ అవార్డు తీసుకున్న సందర్భంగా బుధవారంస్థానిక క్యాపిటల్ హోటల్లో సన్మానం జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు పట్టాభిపురం వారి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎం.ఎల్.సి. ఎ ఎస్. రామకష్ణ మాట్లాడుతూ కషి తో నాస్తి దుర్భిక్షం అని నమ్మి కష్టపడి ఇంత స్థాయికి ఎదిగి ఎంతోమందికి జీవనోపాధి కల్పిస్తున్న జగన్ మోహన్ రావుని యువత ఆదర్శంగా తీసుకోవాలి అని తెలిపారు. లయన్స్ జిల్లా ఇన్చార్జి గవర్నర్ పి.గోపిచంద్ మాట్లాడుతూ జగన్ లయన్స్ క్లబ్ లు చేసే సేవా కార్యక్రమాలకి కూడా తనువంతు సహాయ సహకారాలు అందజేస్తున్న వారికి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమానికి నూతలపాటి వీరప్రకాశరావు, కె.విజయ్ చంద్, ఈదర వెంకటేశ్వర్లు, రామన శ్రీనివాసరావు, డాక్టర్ సాయి, డాక్టర్ చక్రపాణి, కొంజేటి వెంకట నగేష్, నిడమానూరి సురేష్, పరమహంస, బెంజ్ మన్ పాల్గొన్నారు.